క్లుప్తంగా

ప్రవీణ్‌కుమార్‌కు బెస్ట్ సోషల్ వర్కర్ నేషనల్ అవార్డు



కాజీపేట అర్బన్: జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారిగా పనిచేస్తున్న కవి, రచయిత, సోషల్ యాక్టివిస్ట్ సారం ప్రవీణ్‌కుమార్‌కు బెస్ట్ సోషల్ వర్కర్ నేషనల్ అవార్డును బహుజన సాహిత్య అకాడమీ ఆదివారం అందజేసింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ అవార్డుల ప్రదానోత్సవంలో ప్రవీణ్‌కుమార్‌కు అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అవార్డు అందజేశారు.

గిలాఫ్ సమర్పణ



న్యూశాయంపేట: రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్‌లోని దర్గా హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ (రహమతుల్లా అలై), ఢిల్లీలోని హజ్రత్ నిజాముద్దీన్ అవులియాలకు మాజీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ చాంద్‌పాషా ఆధ్వర్యంలో వరంగల్ నగరానికి చెందిన పలువురు ముస్లింలు గిలాఫ్, చాదర్‌ను సమర్పించారు. కార్యక్రమంలో ఖాదర్‌పాషా, రఫీక్, ఆరీఫ్, ఆబిద్, హనీఫ్, షకీల్, ఆరీఫ్ హుస్సేన్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు రిత్విక్



హసన్‌పర్తి: జాతీయ స్థాయి టెన్నిస్ -10 క్రికెట్ పోటీలకు హసన్‌పర్తి మండలం పెంబర్తి శివారులోని విహాస్ పాఠశాల విద్యార్థి బచ్చ రిత్విక్ ఎంపికయ్యాడు. ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరగనున్న పోటీల్లో రిత్విక్ పాల్గొననున్నట్లు పాఠశాల చైర్మన్ డాక్టర్ కోడూరి రామ్మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రిత్విక్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ బండి మల్లేశం, ప్రిన్సిపాల్ కొల్లూరి పావని, ఫిజికల్ డైరెక్టర్ వెంకన్న, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనానికి యత్నం



కాజీపేట: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అరెస్ట్‌ను నిరసిస్తూ కాజీపేట చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను పార్టీ కార్యకర్తలు సోమవారం దహనం చేయడానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్పొరేటర్ సంకు నర్సింగరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా తరలివచ్చి సీఎం దిష్టిబొమ్మకు నిప్పు పెడుతుండగా పోలీసులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో గబ్బెట శ్రీనివాస్, సిరిపాక కుమార్, ఎండీ.అఫ్జల్ పాల్గొన్నారు.

మంత్రి సురేఖ పరామర్శ

ఖిలా వరంగల్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో శివనగర్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ శ్రీరాం రాజు మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను మంత్రి కొండా సురేఖ సోమవారం పరామర్శించారు. ప్రభుత్వం తరఫున అందాల్సిన ప్రయోజనాలతో పాటు అన్ని విధాలా సహాయ సహకారాలను అందించనున్నట్లు బాధితులకు మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీరాం రాజేష్, లావణ్య, సాంబయ్య, రవి, నవీన్, భూదారపు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నడుపుతున్న వారికే అవకాశమివ్వాలి

హన్మకొండ: ప్రస్తుతం వివిధ రూట్లలో నడుపుతున్న అద్దె బస్సుల యజమానులకు తిరిగి కొత్త బస్సులు నడిపే అవకాశం కల్పించాలని ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులు కోరారు. సోమవారం హనుమకొండలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లక్కం ప్రభాకర్, వరంగల్ రీజియన్ అధ్యక్షుడు మారిపల్లి రాంరెడ్డి కలిసి వినతిపత్రం అందించారు. 25 ఏళ్లుగా తమ అగ్రిమెంట్ పూర్తయినా తమకే కొత్త బస్సులు పెట్టుకునే అవకాశం కల్పిస్తూ వస్తున్నారన్నారు. 2014, 2015లో చేసుకున్న అగ్రిమెంట్ పూర్తి కావస్తున్నందున గతంలో మాదిరిగానే తమకు కొత్త బస్సులు పెట్టుకునే అవకాశం కల్పించాలని మంత్రిని కోరారు. మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ప్రయాణికులతో బస్సులపై భారం పడుతున్నా ప్రభుత్వానికి అనుకూలంగా పని చేస్తున్నామన్నారు.

దర్జాగా రోడ్లు కబ్జా

- ప్రైవేట్ ఆస్పత్రుల ఇష్టారాజ్యం
- కాకాజీకాలనీలో ట్రాఫిక్ కష్టాలు
- పట్టించుకోని ట్రాఫిక్, మున్సిపల్ అధికారులు



ఎంఎస్‌రెడ్డి కాంప్లెక్స్ వెనుక రోడ్డుపై యథేచ్ఛగా పార్క్ చేసిన వాహనాలు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కాకాజీకాలనీలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల యజమాన్యాలు యథేచ్ఛగా రోడ్లను కబ్జా చేసినా పట్టించుకున్న వారే కరువయ్యారు. కనీసం పార్కింగ్ వసతులు లేనప్పటికీ ఆస్పత్రులను నెలకొల్పిన కొందరు వైద్యులు.. రోడ్లపైనే తమ వాహనాలను పార్కింగ్ చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కనీస నిబంధనలు పాటించకుండా దవాఖానలు నిర్వహిస్తున్న ఆయా నర్సింగ్‌హోంలపై మున్సిపల్, ట్రాఫిక్ పోలీసులు కనీస చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వందలాది ఆస్పత్రులు

హనుమకొండ బస్టాండ్‌కు కూతవేటు దూరంలో, హనుమకొండ చౌరస్తాను ఆనుకుని ఉన్న కాకాజీకాలనీలో వందల సంఖ్యలో ప్రైవేట్ ఆస్పత్రులు కొనసాగుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాకుండా ఖమ్మం, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల నుంచి ఇక్కడి వైద్యం కోసం ప్రతిరోజూ వేల సంఖ్యలో రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. అలాగే, వరంగల్ నుంచి కాజీపేట, హనుమకొండ బస్టాండ్ వైపు వెళ్లే బస్సులు, ఆటోలు, ఇతర వాహనదారులు కాకాజీకాలనీ నుంచే వెళ్తుంటారు. చౌరస్తా నుంచి పద్మాక్షి కాలనీ మీదుగా బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన దారి, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి బస్టాండ్ వరకు, విజయ టాకీస్ నుంచి బస్టాండ్ మలుపు, చౌరస్తాలోని జుబేర్ బుక్‌స్టాల్ నుంచి గోమతి ఆస్పత్రితో పాటు అంతర్గతంగా మరో 8 వరకు గల్లీల్లో ఆస్పత్రులు ఉన్నాయి. దాంతో వైద్యం కోసం వచ్చే వారితోపాటు వాహనదారులతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటోంది.

పార్కింగ్‌కు స్థలం కరువు

కాకాజీకాలనీలో కొనసాగుతున్న అధిక శాతం ప్రైవేట్ ఆస్పత్రుకు పార్కింగ్ స్థలమే లేదు. కొన్నింటికి సెల్లార్లు ఉన్నప్పటికీ కేవలం చెప్పుకోవడానికే తప్ప తగిన పార్కింగ్ సౌకర్యం ఉండదు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు సంబంధించిన వాహనాలతో పాటు వైద్యులు, ఆస్పత్రి సిబ్బందికి చెందిన కార్లు, ఇతర వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తుంటారు. 24 గంటల పాటు వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండడంతో వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా భవనాలను నిర్మించి, ఆస్పత్రులను నిర్వహిస్తున్న యజమాన్యాలపై మున్సిపల్ అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనదారుల ఫొటోలు తీసి చలాన్లు విధించే ట్రాఫిక్ పోలీసులు.. కాకాజీ కాలనీలో రోడ్లపైనే పార్కింగ్ చేసిన వాహనాలపై స్పందించడం లేదు.

పార్కింగ్‌కు పరిష్కారం చూపాలి



హెల్మెట్ లేకుండా బైక్ ఆపి ఫైన్ వసూలు చేసే ట్రాఫిక్ పోలీసులు.. రోడ్లపైన ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్న ప్రైవేట్ సంస్థల యజమాన్యాలకు సైతం జరిమానాలు విధించాలి. పార్కింగ్ వెసులుబాటు లేని భవనాలకు మున్సిపల్ అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– విజయ్, న్యూరాయపుర

బైక్ పార్క్‌కూ స్థలం లేదు



కాకాజీకాలనీలో పనిపై వెళ్తే బైక్ పార్కింగ్ చేద్దామంటే స్థలం కనిపించలేదు. మూడు, నాలుగు అంతకుమించి అంతస్తుల భవనాలు ఉన్నాయే తప్ప, పార్కింగ్ కోసం కనీసం సెల్లార్లు కూడా కనిపించడం లేదు. పార్కింగ్‌కు స్థలం లేకపోయినా అధికారులు అనుమతులు ఇవ్వడం దారుణం. అధికారులు స్పందించి పార్కింగ్ సమస్యపై తగు చర్యలు తీసుకోవాలి.

– ప్రవీణ్, సుధానగర్

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి

- బీజేపీ రాష్ట్ర నాయకుడు కాళీప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కాళీప్రసాద్

హన్మకొండ: కామారెడ్డి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ నేత డాక్టర్ పగడాల కాళీప్రసాద్, బీజేపీ ఓబీసీ సెల్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి పూర్ణాచారి డిమాండ్ చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు.. ప్రజలను మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. ఏఒక్క హామీనీ అమలు చేయకుండా జనాన్ని వంచిస్తోందని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభాలో 50శాతం పైగా ఉన్న బీసీలకు 42 శాతం రేజర్వేషన్లను అమలు చేయాలని, బడ్జెట్‌లో బీసీలకు రూ.50 వేల కోట్లు కేటాయించాలని సూచించారు. నాయకులు శ్రీనివాస్ యాదవ్, కత్తుల అనిల్ యాదవ్, ఉప్పు రాజు, మల్లికార్జున్, సులోచన, సతీష్, సువర్ణలత, కీర్తి సురేష్, రవి, నవజీవన్, అభిషేక్, మధు పాల్గొన్నారు.

వరంగల్: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కన్వీనర్ కోమాకుల నాగరాజు డిమాండ్ చేశారు. ఎల్‌బీనగర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ప్రతిఏటా రూ.20వేల కోట్ల బడ్జెట్ బీసీలకు కేటాయించాలని సూచించారు. సమావేశంలో ఓబీసీ మోర్చా నాయకులు బైరి మురళీకృష్ణ, కోట సతీష్, మడిపెల్లి నాగరాజ్‌గౌడ్, కె.మల్లికార్జున్, టి.క్రాంతి, ఎం.ప్రభాకర్, నవీన్‌గౌడ్, శ్రీకాంత్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు



చైనా మాంజాను సీజ్ చేస్తున్న ఏసీపీ

ఖిలా వరంగల్: చైనా మాంజా విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరామ్ నాయక్ హెచ్చరించారు. సంప్రదాయ పద్ధతుల్లో పతంగులు ఎగురవేయాలని సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సీపీ అంబర్ కిషోర్‌ఝా ఆదేశాల ప్రకారం వరంగల్ శివనగర్‌లో ఏసీపీ నందిరాంనాయక్ ఆధ్వర్యంలో ఎస్సై సురేష్ నేతృత్వంలో పతంగుల దుకాణాలపై సోమవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు రూ.50 వేల విలువైన చైనా మాంజాను సీజ్‌చేసి నిర్వాహకుడు కలివల రాజేష్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ నందిరాంనాయక్ మాట్లాడుతూ చైనా మాంజాతో పతంగులు ఎరవేయడం వల్ల వాహనదారులు, ప్రజలు గాయాలపాలవుతున్నారని, పక్షులు, పశువులు ప్రమాదాల బారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మాంజా అమ్మినా.. ఎగురవేసినా చర్యలు

వరంగల్: ప్రభుత్వ నిషేధిత చైనా మాంజాను విక్రయించినా, దానితో పతంగులు ఎగురవేసినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎంఏ.షుకుర్ హెచ్చరించారు. చైనా మాంజాతో పతంగులు ఎగురవేసినా, విక్రయించినట్లు తెలిసినా 100 లేదా 87126 85118, 87126 85007 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

విద్యుత్ లైన్లకు దూరంగా ఎగురవేయాలి

హన్మకొండ: విద్యుత్ లైన్లకు దూరంగా ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే పతంగులు ఎగురవేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ, వరంగల్ ఎస్ఈ మదుసూధన్ రావు సూచించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పిల్లలు, పెద్దలు సంతోషంగా పతంగులు ఎగురవేయడం ఒక సంప్రదాయకంగా వస్తోందని, సురక్షిత ప్రాంతాల్లో పతంగులు ఎగురవేయడం శ్రేయస్కరమని వారు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పతంగులు ఎగురవేయడం వల్ల మాంజాలతో ప్రమాదాలు జరిగే అవకాశముందని, సరఫరాలోనూ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ సంబంధిత ఫిర్యాదులకు 1912 టోల్‌ఫ్రీ నంబర్‌లో లేదా సమీపంలోని విద్యుత్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

రైతు ద్రోహి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



ఫోర్ట్‌రోడ్డు పెట్రోల్‌బంక్ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న నరేందర్, నాయకులు

ఖిలా వరంగల్: తెలంగాణ చరిత్రలో సీఎం రేవంత్ రైతు ద్రోహిగా మిగిలిపోవడం ఖాయమని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆరోపించారు. రైతులకు సంఘీభావంగా బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. దాంతో ఫోర్ట్‌రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచి ట్రాఫిక్ స్తంభించింది. మిల్స్‌కాలనీ ఎస్సై సురేష్ అక్కడికి చేరుకుని నాయకులకు నచ్చజెప్పి నిరసనను విరమింపజేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటేసిన పాపానికి రైతున్నలను నట్టేటా ముంచారని, ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి రూ.12 వేలకు కుదించారని అన్నారు. రానున్న రోజుల్లో రైతులే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్లి రవి, వరంగల్ మార్కెట్ మాజీ చైర్మన్ రమేష్ బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వర్ణలతకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల పరిశోధకురాలు కత్తెరశాల స్వర్ణలతకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. డిజైన్ సింథసిస్ ఆఫ్ న్యూ హెటిరోసైక్లిక్ కాంపౌండ్స్ ఫర్ యాంటి కేన్సర్ యాక్టివిటీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి స్వర్ణలతకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ గాదె సమ్మయ్య పర్యవేక్షణలో స్వర్ణలత తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఆమె ప్రస్తుతం హనుమకొండలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

క్రాంతికుమార్‌కు డాక్టరేట్



కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో పరిశోధకుడు క్రాంతికుమార్ అనంథోజ్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఫైనాన్సియల్ లిటరసీ అండ్ డిజిటల్ ఎకానమీ ఇన్ ఇండియా ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ అర్బన్ ఏరియాస్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై విభాగం ప్రొఫెసర్ కట్ల రాజేందర్ పర్యవేక్షణలో క్రాంతికుమార్‌కు డాక్టరేట్ పూర్తిచేశారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- అవగాహన సదస్సులో ఎంవీఐ శోభన్‌బాబు



మాట్లాడుతున్న ఎంవీఐ శోభన్‌బాబు

ఖిలా వరంగల్: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎంవీఐలు శోభన్‌బాబు, జైపాల్‌రెడ్డి సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వరంగల్ రంగశాయిపేటలోని వెల్ఫేర్ హాస్టల్‌లో వరంగల్ రవాణాశాఖ అధికారుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. బైక్‌పై వెళ్తున్నప్పుడు హెల్మెట్ పెట్టుకోవాలని, కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవీఐలు మద్దెల నరేందర్, గుగులోత్ ఉదయ్ కుమార్, ఏఓ నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

శంఖారావాన్ని విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ: బీసీ విద్యార్థుల సమర శంఖారావం సభను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు పిలుపునిచ్చారు. ఈనెల 8న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరగనున్న బీసీ విద్యార్థి శంఖారావం వాల్‌పోస్టర్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా విద్యార్థుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తోందని విమర్శించారు. గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.7,500 కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. బీసీ విద్యార్థులకు 10 వేల ర్యాంకు నిబంధనను ఎత్తివేయాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల వలే మొత్తం ఫీజును ప్రభుత్వమే భరించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్‌రాజ్, ఉపాధ్యక్షుడు గణేష్, ప్రచార కార్యదర్శి వేణుగోపాల్, కార్యవర్గ సభ్యులు శ్రీసాయి, సురేష్, గణేష్, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులపాటు మృత్యువుతో పోరాడి ఓడిన వృద్ధురాలు



దారవత్ సోనా (మృతురాలు)

కాజీపేట: నెల రోజులుగా ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు సోమవారం మృతి చెందినట్లు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఆయన సోమవారం మాట్లాడుతూ గతనెల 8వ తేదీన నిట్ కళాశాల ఎదురుగా రహదారిపై వృద్ధురాలు స్పృహ తప్పి పడిఉండగా, స్థానికుల ఫిర్యాదు మేరకు 108 సిబ్బంది జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. వైద్య చికిత్సకు స్పందించిన వృద్ధురాలు దారవత్ సోనా (70) నెక్కొండ అని మాత్రమే చెప్పిందని పేర్కొన్నారు. దాదాపు 30 రోజుల పాటు వైద్యం అందించినప్పటికీ కోలుకోలేక తుదిశ్వాస విడిచినట్లు వివరించారు. ఆమె మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపర్చామని, 87126 85008 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆలయంలో మహా అన్నదానం

వరంగల్ చౌరస్తా: సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి కుమార్తె రమ్యానంద భారతిస్వామి జన్మదినం సందర్భంగా 27 డివిజన్‌లోని గోవిందరాజుల గుట్ట పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో సోమవారం మహా అన్నదానం నిర్వహించారు.

హమాలీ రేట్లు పెంచకుంటే ముట్టడిస్తాం



డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వరంగల్: సివిల్ సప్లయీస్ గోదాంలో పనిచేసే హమాలీ ధరల పెంపునకు సంబంధించి ఒప్పందం ప్రకారం జీఓను విడుదల చేయకుంటే మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని సివిల్ సప్లయిస్ హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వరుడు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ అన్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ గోడౌన్‌లో పనిచేసే హమాలీ కార్మికులు వరంగల్ కలెక్టరేట్‌ను సోమవారం ముట్టడించి జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మికి పలు డిమాండ్లతో కూడిన మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, నాయకులు గోవర్ధనచారి, నరసింహం, కిషోర్, కుమారస్వామి, సురేందర్, సతీష్, సాంబయ్య, రమేష్, శ్రీను, బాబు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది సారయ్యకు నివాళి

వరంగల్ లీగల్: న్యాయవాది గుబ్బల సారయ్య అకాల మరణానికి సంతాపంగా వరంగల్ జిల్లా ప్రధాన కోర్టు హాల్‌లో సోమవారం సంతాప సమావేశం నిర్వహించారు. వరంగల్, హనుమకొండ ప్రధాన న్యాయమూర్తులు వీబీ.నిర్మలా గీతాంబ, సీహెచ్.రమేష్‌బాబు నేతృత్వంలో నిర్వహించిన సంతాప సమావేశంలో వరంగల్ జిల్లా గవర్నమెంట్ ప్లీడర్ పోతరాజు రవి... సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సారయ్యకు న్యాయమూర్తులు, న్యాయవాదులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బార్ అసోసియేషన్ సమావేశ మందిరం అంబేడ్కర్ హాల్‌లో నిర్వహించి సంతాప సభకు వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ అధ్యక్షత వహించారు. పలువురు మాట్లాడుతూ గీసుకొండ మండలం వంచనగిరి గ్రామానికి చెందిన సారయ్య ఆర్టీసీలో సూపరింటెండెంట్‌గా ఉద్యోగం చేసి పదవీ విరమణ అనంతరం 2009లో న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించి, లేబర్ కోర్టు న్యాయవాదిగా కార్మికుల పక్షాన పలు కేసులు వాదించారని గుర్తుచేశారు. సంతాప సభలో హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి లడే రమేష్, వరంగల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుదర్శన్, క్రీడల కార్యదర్శి రమణ, కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్, మాలతి, శృతి, రుత్విక్, సీనియర్ న్యాయవాదులు సహోదర్‌రెడ్డి, అంబరీష్‌రావు, సదాశివుడు, రమేష్‌గౌడ్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

వృద్ధులు, విద్యార్థులకు చేయూత



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఫేస్‌బుక్ ఫ్రెండ్స్



బ్యాగులు పంపిణీ చేస్తున్న వెంకట్‌రెడ్డి

వరంగల్: వరంగల్ నగర పరిధిలో ఏనుమాముల ప్రాంతంలోని ఐలమ్మనగర్, సుందరయ్య నగర్, ఎన్టీఆర్ నగర్, ఎస్ఆర్ నగర్, కారల్‌మార్క్స్ నగర్ ప్రాంతాలకు చెందిన నిరుపేద వృద్ధులకు స్నేహ గీతం ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సోమవారం దుప్పట్లు (బ్లాంకెట్లు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్నేహ గీతం ఫేస్‌బుక్ అడ్మిన్ దుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ చలికాలం దృష్ట్యా 220 మందికి దుప్పట్లు పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో నీల రమాదేవి, రఘుబాబు, శ్రీనివాస్, శ్రీరామ్, కొత్తపెల్లి సునీల్, భాస్కర్‌రాజు, పాండురంగం, రాజు, సలీం, రాజశేఖర్, కుమారస్వామి, లింగస్వామి, నరేష్, రమ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

హసన్‌పర్తి: సర్కార్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు చేయూతనిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు బ్యాగులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సుమారు 210 దేశాల్లో లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. ముఖ్యంగా తెలంగాణలో పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు లయన్స్ క్లబ్ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. క్లబ్ అధ్యక్షుడు కృపాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా సమన్వయ కర్త డాక్టర్ అజిత్‌కుమార్, క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్లు నాగమళ్ల సుధీర్, వెలగందు భీష్మనాథం, మోహన్, యాదగిరి, తోట సంపత్, శ్యాంసుందర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అబాకస్‌లో ట్రైసిటీ విద్యార్థుల ప్రతిభ



అబాకస్‌లో బహుమతులు గెలుచుకున్న నగర విద్యార్థులతో మాస్టర్ ట్రైనర్ నరేష్ గుప్తా, తదితరులు

హన్మకొండ: అంతర్జాతీయ స్థాయి అలామా అబాకస్ పోటీల్లో ట్రైసిటీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. డిసెంబర్ 29న ఆన్‌లైన్‌లో, ఈనెల 5న ఆఫ్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ సమీపంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఆదివారం రాత్రి బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్, హనుమకొండ, కాజీపేటకు చెందిన విద్యార్థులు 1 నుంచి 8 లెవల్స్‌లో వివిధ కేటగిరీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు అలామా అబాకస్ ఇంటర్‌నేషనల్ ఫౌండర్ ముత్తుకుమార్ బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా ఫ్రాంచైజీ, మాస్టర్ ట్రైనర్ నరేష్ గుప్తా, ఉపాధ్యాయులు శ్రీలేఖ, శిల్ప, నవనీత, లిఖిత పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

డైరీ ఆవిష్కరణకు తరలిన నాయకులు

హన్మకొండ అర్బన్: టీఎన్జీవోస్ కేంద్ర సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణకు సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు, ఉద్యోగులు కలెక్టరేట్ నుంచి ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కు సోమవారం బయలుదేరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణు గోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్, కేంద్ర సంఘం నేతలు రాము నాయక్, మోయిజ్, లక్ష్మీప్రసాద్, జిల్లా నేతలు సలీం, శ్రీనివాస్, రాజమౌళి, సురేష్, రాజేష్ ఖన్నా, గౌతమ్, భరత్ రామాంజనేయులు, గోపి కిషోర్, ప్రణయ్, పృథ్వీ, భగవన్ రెడ్డి, హరినాథ్, నవీన్, అశోక్, వెంకన్న పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన టీఎస్ఈఈయూ నేతలు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ -327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్, నాయకులు కలిశారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ వరుణ్‌రెడ్డిని టీఎస్ఈఈయూ -327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్, యూనియన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ తులసి శ్రీమతి, నాయకుడు గుండ శ్రీనివాస్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి డైరీ అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ కావ్యను కలిసిన నాయకులు

హన్మకొండ అర్బన్: వరంగల్ ఎంపీ కడియం కావ్యను టీఎన్జీవోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు బొకే అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బైరి సోమన్న, పుల్లూరి వేణుగోపాల్, పనికెల రాజేష్, శనిగరపు శ్యాంసుందర్, రాము నాయక్, లక్ష్మీప్రసాద్, రాజేష్‌ఖన్నా, అనూప్ రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ఖిలా వరంగల్: ప్రభుత్వ పాఠశాలల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజ్‌కుమార్, వై.అశోక్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ కాశికుంట విద్యానగర్ కాలనీలోని బాంబే రైస్ మిల్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయులు బి.మురళి, అనిత, రాజకుమారి, శివకుమార్, షాబుద్దీన్, ఇందిర, చందన పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి కృషి

హసన్‌పర్తి: యాదవ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన మారం సుధాకర్, వేల్పులు సాయికుమార్ తెలిపారు. సంఘం పూర్తిస్థాయి కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించారు. సంఘం ఉపాధ్యక్షులుగా అట్ల చిన్నఎల్లయ్య, కాల్వ శ్రీనివాస్, కోశాధికారి మారం సదానందం, మంత్రి శ్రీనివాస్, సభ్యులుగా రణధీర్, వేల్పుల చక్రవర్తి, సాయికృష్ణ, మల్లయ్య, మారం రాకేష్, అంజయ్య ఎన్నికైనట్లు అధ్యక్షుడు మారం సుధాకర్ వివరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

విద్యారణ్యపురి: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, బాధ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని వినతి

హసన్‌పర్తి: హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎల్లాపురం వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. ఈమేరకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు.